**ఈ కథ మతాంతర ప్రేమవివాహం గురించి కాదు. ఆ అంశం ముఖ్యమే.
కానీ, నా అనేక ఇతర కథల్లాగే ఇతివృత్తం ఒక నెపం. ముగ్గురు మంచి మనుషులు,
అన్నివిధాలా ఒక అడుగు ముందుకు వెయ్యగలిగినవారే ఒక సరయిన
నిర్ణయం తీసుకోలేకపోయారు. మంచివాళ్ల వైఫల్యం గురించిన కథ.**

తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి

# 13 దయారత్నం

నర్సిం





అప్పటికే అలిసి నీరసించిన ఎండ చెట్లమీద పడుకుంది. నాలుగున్నర దాటింది. గార్డెన్ రెస్టారెంటు నిండా చిన్నా పెద్దా చెట్లు. అన్ని చెట్ల కిందా రంగురంగుల గొడుగుల కింద వేసిన కుర్చీలు, టేబిళ్లు. రెస్టారెంటుని చుట్టుకుని ఉన్న రోడ్డుమీంచి లోపలికి రెండు ద్వారాలున్నాయి. ఒకటి ముందునుంచి, రెండోది వెనకనుంచి. దయారత్నం ఎదురుగుండా కుర్చీలో వెడల్పుగా ఆనందరాజు, అతని పక్కన తక్కువ వెడల్పులో ముకుందరావు కూచున్నారు. ఆమ్లెట్లు చెప్పి కబుర్లు చప్పరిస్తున్నారు. దేశంలో అతిపెద్ద ఫార్మసూటికల్స్ హిమాలయ ఎండ్ మార్టిన్ కంపెనీలో ముగ్గురూ ఏరియా మేనేజర్లు.

కాన్ఫరెన్సు మధ్యాహ్నం మూడుగంటలకి ముగించారు. అందర్నీ వదిలించుకుని గార్డెన్ రెస్టారెంట్లో కూచుని పాతకాలం గురించీ, సంసారం గురించీ మాట్లాడుకుంటున్నారు. రత్నం ఒక్కడే హైదరాబాదీ.

“పిల్లలేం చేస్తున్నారు దయా?” అన్నాడు ముకుందరావు.

“పెరుగుతున్నారు బాస్.”

“దాంతోపాటు ఏం చేస్తున్నారు?”

“ఇద్దరూ కాలేజీల్లో ఉన్నారు. తరవాత వాళ్లిష్టం.”

కొంచెం అవతలగా ఒక అరడజనుమంది కోలాహలంగా వచ్చి కోలాహలంగా ఉన్నారు. ఎవరిదో పుట్టినరోజు అయి ఉంటుందనుకున్నాడు రత్నం. ముగ్గుర్నీ జ్ఞాపకాల పొద చుట్టుముట్టింది. ఆనందరాజు తల వెనక అవతల గేట్లోంచి భుజాలమీద చేతులు వేసుకుని వచ్చి లోపల చెట్టుకింద కూచుంటున్న జంట కనిపిస్తోంది. ఇద్దరూ జీన్సులో, అమ్మాయి పొడుగు చేతుల టీషర్టులో, యువకుడు చేతులు మడిచిన చొక్కాలో కనిపిస్తున్నారు. వెయిటరు ముగ్గురి ముందూ ఆమ్లెట్లు పెడుతున్నాడు. రత్నం చూపులు పొడవాటి కరెంటు తీగల్లా దూరంగా కూచున్న జంటకి అతుక్కుపోయాయి. వాళ్ల ముఖాలు అవతలి వేపున్నాయి. ఆమె అతనివేపు తిరిగి నవ్వింది. అతను ఆమె ముంగురుల్ని వెనక్కి సద్దుతున్నాడు. స్నేహితులిద్దరికీ ఆమ్లెట్లు బాగున్నాయి. రత్నానికి రుచించలేదు. ముగ్గురూ టీలు తాగేసరికి చెట్లు

ఎండని పీల్చుకున్నాయి. టీలు ఆర్డరిచ్చేసరికి రాజు తల వెనక జంట వెళ్లిపోయింది, ఆమె నడుము చుట్టూ అతని చెయ్యి వేసుకుని. ముగ్గురూ లేచేరు.

*

రెస్టారెంటుకి వెళ్లకుండా ఇంటికి వెళ్లి రాజునీ ముకుందాన్నీ ఎయిర్‌పోర్టులో దింపి శర్మ దగ్గిరికి వెళ్లి ఉంటే ఏమై ఉండేది? గడిచిన అనేక సంవత్సరాలు అనేకసార్లు తనకీ ప్రశ్న ఎదురైంది. దీనికి సమాధానం ఉండదని తనకి తెలుసు. అందుకే దేవుడి మీద భారం వేస్తే కొంత సుఖం దక్కుతుంది. జవాబులు చెప్పుకుని బాధపడి, నిజం బరువు నెత్తిమీద మోసుకు తిరిగే బాధ తప్పుతుంది.

దయారత్నం ఆ రాత్రి శర్మ ఇంటినుంచి ఒచ్చిన తరవాత గంట పైగా ప్రార్థన చేసుకున్నాడు. ఒకసారో రెండుసార్లో అతన్ని చూసి అటు తిరిగి పడుకుని రత్నం ఇంగ్లీషు బైబిలు చిన్న గొంతులో చదవడం వింటూ నిద్రపోయింది శాంత. ('ఇంత మంచిబుద్ధి ఎప్పట్నించి!')

*

లేచి కిటికీకి చేర్చి దిండు నిలబెట్టి పడుకున్నాడు దయారత్నం. గాజు కిటికీ అవతల అస్పష్టలోకం జారిపోతూ అప్పుడప్పుడు ఏదో దీపం కింద గాజు బద్దలైనట్టు ముక్కలవుతోంది. మళ్లీ చీకటి. విజిలు ఊదిన శబ్దం. వేగంగా లయబద్ధంగా దీపాల సెలయేరులా పారుతోంది రైలు. రీడింగ్ లైటు వేసుకుని చదువుకోడానికి పుస్తకం తెరిచాడు రత్నం. సెల్లు మోగింది. పక్క రెండుబెర్తులవాళ్లూ, పైబెర్తుమీది అమ్మాయి కూడా నిద్రలో ఉన్నారు.

"డాడీ, పదిన్నరయింది. ఇంకా పడుకోలేదా? టాబ్లెట్లు వేసుకున్నారా? ఎక్కువసేపు మేలుకోకండి."

"టాబ్లెట్లు వేసుకున్నా తల్లీ, పదిన్నరే కదా! పడుకుంటాలే. నీ కొడుకేం చేస్తున్నాడు?"

"మీ మనవడు టీవీ చూస్తున్నాడు. మీ అల్లుడు ఫోన్ మాట్లాడుతున్నాడు. నేను మీతో మాట్లాడుతున్నాను. ఓకే, జాగర్త. రోటీలు తిన్నారా? ఆంటీని, శర్మ అంకుల్‌నీ అడిగేనని చెప్పండి."

చెన్నైలో ఫోను పెట్టేసింది సుగుణ. కూతురి మాటలు, కంఠం జోలలాగ పనిచేశాయి. తనకంటే మంచిపిల్ల. ఎవరేనా ముసుగు తగిలించుకుని వచ్చి చీకట్లో రహస్యంగా, 'దయా, నువ్వు మంచివాడివేనా?' అంటే తను అడ్డంగా మెల్లిగా తల ఊపుతాడు. తలూపుతూ కళ్లు మూసుకున్నాడతను.

*

స్నానం చేసి కూచోగానే ఫోను మోగింది.

"ఏం చేస్తున్నావురా?"

"ఇప్పుడే వచ్చి కూచున్నాను."

"పది నిమిషాల్లో ఇక్కడుండు."

"ఏం?"

"రారా చెప్తాను."

"మీవాళ్లు ఉన్నారా?"

"లేదు ఉదయం వెళ్లిపోయారు. నువ్వు రా ముందు."

రత్నం లేచి కూతుర్ని పిలిచాడు. "బేబమ్మా..."

"అదింకా రాలేదు."

రత్నం బట్టలు వేసుకుని కారు తాళాలు తీసుకోబోయి మళ్లీ బోర్డుకి తగిలించాడు.

"డాడీ..." డైనింగ్ టేబిలు దగ్గిర నుంచుని మంచినీళ్లు తాగుతోంది సుగుణ. ఆమె వేపే చూస్తూండిపోయాడు రత్నం.

"ఏంటి డాడీ? నేనా కాదాని అనుమానం వచ్చిందా?"

కూతురి దగ్గిరికి వెళ్లి ఆమె తలమీద చెయ్యి పెట్టి, "అవును. నీకెట్టా తెలిసిందే?"

ఆమె నవ్వుతూ లోపలికి వెళ్లిపోయింది. క్షణంసేపు ఆమె వెళ్లినవేపు చూసి రత్నం బయటికి బయల్దేరేడు. అడుగు వేస్తుంటే నిన్నటికంటే బరువుగా ఉన్నట్టనిపించింది. కేబ్ దిగి, గేటు తెరిచి లోపలికి అడుగు పెడుతూండగానే, "హలో అంకుల్," అంటూ మెట్లు దిగి వచ్చేడు విష్ణు.

"డాడీ పైన మీకోసం చూస్తున్నారు." రత్నం నవ్వి అతని భుజం మీద చెయ్యి వెయ్యబోయి ఆగిపోయాడు. విష్ణు, "ఓకే అంకుల్," అంటూ లోపలికి వెళ్లిపోయాడు. పైన రెండు విశాలమైన గదులు వేశాడు శర్మ. చీమలబారులా, బంధువులబారు శర్మ ఇంటికి. విసుగనిపించదు శర్మకి. ('బాగా క్లోజురా వీళ్లు.') శర్మ బావమరుదులు, మరదళ్లు, చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు, బతికున్న మేనమామ, బాబాయిలు- ఓ పెద్ద దొండపందిరిలా ఉంటుంది శర్మ ఇల్లు. అతనికి అందరూ కావాలి. చేసేది పెద్ద ప్రభుత్వోద్యోగం కనక, పందిరి నిలబడింది.

టీపాయి మీద అందమైన సీసా కన్య. రెండు గ్లాసులూ, రెండు ప్లేట్ల నిండా తినడానికి అన్నీ నైవేద్యంగా సిద్ధంగా ఉన్నాయి. "రారా బాబూ, ఇందాకట్నించీ చూస్తున్నాను."

గళ్ల లుంగీ మీద తెల్ల టీషర్టులో శర్మ అయిదేళ్లు వయసు తగ్గి ఉన్నాడు. కానీ కొత్తగా కనిపిస్తున్నాడతను.

“ఆ చూపేవిటి? ముందు కూచో.”

రత్నం నవ్వుతూ అన్నాడు. “ఇదేనా అర్జంటు పని?”

“అవున్రా, మనం కలిసి వారం పదిరోజులైంది. మావాళ్లు వెళ్లిపోయారు. ఇదిగో దీన్ని బహూకరించి మరీ వెళ్లేరు. నువ్వు లేకుండా ఎలా?”

కూచుంటూ అన్నాడు రత్నం. “మనం కలిసి ఇరవైరోజులైంది. నేను గత నాలుగు రోజులుగా మా ఏరియా మేనేజర్ల కాన్ఫరెన్సులో మునిగిపోయాను. సరే, నీ గొడవ నీది.”

“మావాడొకడికి పెళ్లి గురించి వచ్చేర్రా, అందరూ కాదులే. ఏవో కబుర్లూ, కాలక్షేపాలు, నీకు తెలుసుగా నాకు బంధువులెక్కువ. ఈ ఆపేక్షలు, ఇచ్చి పుచ్చుకోడాలు బావుంటాయి నాకు. లేకపోతే చేసేదేం లేదు. ఉన్నాయి గనక. వాళ్లకి మన కుటుంబం అంటే గౌరవం. అది పోగొట్టుకోవడం నాకిష్టం ఉండదు. వీళ్లలో నీకు తెలీనివాళ్లు తక్కువ.”

“ఇది విశాఖపట్నం గుంపు అయితే తెలుసు. రాధాకృష్ణగారూ, కేశవరావు గారూ మొదలైన జనం.”

“ఆ వాళ్లే. నీ గురించి చాలాసార్లు అనుకున్నాం. కానీ ఇల్లంతా జనం. కూచున్నట్టుండదని పిలవలేదు.”

“రక్షించావు. నేను ఎక్కువసేపు ఉండన్రా. పోయి పండుకోవాలి.”

“Ok, cheers.”

ఇద్దరూ గ్లాసులు కలిపి మొదటి గుక్క రుచి చూశారు. “బ్రెమ్మాండం,” అన్నాడు రత్నం. “ఇంతకీ పెళ్లి కుదిర్చావా?”

“ఆ సంతోషంగా ఉంది. పిల్లలిద్దరికీ నచ్చింది.”

“అసలు అదేగదా?”

“ఒరే. పెళ్లి అంటే రెండు కుటుంబాల మధ్య కుదిరే బంధుత్వం. నువ్వు చాదస్తం అనుకోనంటే చెప్తాను. మనం బంధువుల్ని కాకుల్లా గద్దల్లా చూస్తూంటాం. ఉంటారు అలాంటివాళ్లు. బంధువుల్ని అనవసరంగా వదులుకోడం దేనికిరా? వాళ్లు నువ్వు తినే కంచం లాక్కుపోతారా?”

రత్నం నీరసంగా నవ్వేడు. “ఓకే,” అన్నాడతను.

చటుక్కున ఫోను తీశాడు శర్మ.

"కాంతీ రత్నం ఒచ్చేడు," కిందికి సమాచారం వెళ్లిన నాలుగు నిమిషాల తరవాత కాంతి వచ్చింది.

"అంకులొొచ్చేరని తెలుసు నాన్నగారూ, విష్ణు చెప్పేడు. హలో అంకుల్!"

దయారత్నం నవ్వుతూ చెయ్యి జాపేడు.

"కూచో."

"ఎందుకంకుల్? మీరు బిజీగా ఉన్నారు గదా?"

"కూచోవమ్మా ఓ నిమిషం. నిన్ను చూసి చాలారోజులైంది."

కాంతి వాళ్ల నాన్నలాగే సన్నగా, పొడుగ్గా, వాళ్లమ్మలా అందంగా ఉంటుంది.

"అంకుల్. సుగుణేం చేస్తోంది?"

"ఏమో... నేను ఆఫీసు నుంచి వచ్చిన తరవాత వచ్చింది ఆవిడ."

"దానికి నిన్న రెండుసార్లు ఫోన్ చేశాను. షాపింగ్‌కి వెళ్లాలి, రమ్మంది."

"అదా? దాని బర్త్‌డే గదా? నా జేబులు కొట్టి బాగా సెలబ్రేట్ చేద్దావనుకుంటోంది."

శర్మ పెద్దగా నవ్వి అన్నాడు. "ఇక్కడ ఈవిడక్కూడా అందులో చాలా అనుభవం ఉందిరా."

"నమ్మకండి అంకుల్. మీ ఇద్దరూ ఒకటే. అబ్బాయిలైతే ఏవీ అనరు."

సుగుణ పుట్టినరోజు గురించి కాసేపు చర్చించి, "మేం మాట్లాడుకుంటాం లెండకుంల్. We know what to do," అంటూ బై చెప్పి కిందికి వెళ్లిపోయింది, కాంతి.

"ఆడపిల్ల లేని ఇంట్లో కళ ఉండదురా," అన్నాడు శర్మ.

"ఊఁ. ఏ సమస్యా లేనంతవరకూ అంతే."

"మన పిల్లలకి మన స్నేహం వారసత్వంగా వచ్చిందిరా. విష్ణు, రత్నాకర్ మాట్లాడుకోని రోజుండదు. మనం కలిసి తిరిగిన రోజుల్లో ఫోన్లా పాడా?"

"నీ స్నేహం వల్ల కిరస్తానీ బేపన అయిపోయాను."

"ఆ రెంటికీ సంబంధం లేని స్నేహం మనది. అవునాకాదా?"

"మన స్నేహం చెడే వరకూ వచ్చిన గొడవల్లేవు గదా."

"గొడవేవిటి? ఒచ్చిందే అనుకో. స్నేహం పోతుందా?"

"ఒచ్చే గొడవని బట్టి ఉంటుంది."

"సరే. గొడవపడి చూద్దాం. గ్లాసివ్వు."

ఇద్దరూ కబుర్లలో పడిపోయారు. కాలేజీలో ఉండగా ఇద్దరూ ఒకే టీమ్‌లో క్రికెట్ ఆడేరు. క్రికెట్, దొంగతనంగా బీర్లు తాగడంతో స్నేహం రుచికరంగా మారింది.

శర్మ ఎరుపు కలిసిన తెలుపు. దయారత్నం నలుపు కలిసిన తెలుపు. రత్నం కెమిస్ట్రీ పీజీ చేశాడు. శర్మ స్టాటిస్టిక్సు చేశాడు. పక్కపక్కనే పెరిగిన చెట్లలా ఇద్దరూ కలిసిపోయారు. మొత్తం టీమ్‌లో వీళ్లిద్దరే మిగిలేరు. శర్మ హైద్రాబాదు వదల్లేదు. ఉద్యోగాలు రాగానే ఇద్దరికీ పెళ్లిళ్లయిపోయాయి. ఇద్దరూ హైదరాబాదులో ఉన్నంతకాలం ప్రతి నెలా మొదటి శనివారం రాత్రి శర్మ ఇంట్లో ఒకసారి, రత్నం దగ్గిర మరొకసారి బైఠాయింపు ఉండేది. రత్నం భార్య శాంత, శర్మకి ఆమ్లెట్ల రుచి చూపించింది. శర్మ వెళ్లి ఇంట్లో అందరికీ ఆమ్లెట్లు పరిచయం చేశాడు. తరచుగా అంకుల్‌కి కాంతి ఆమ్లెట్లు చేసిస్తుంది. లెక్కలేనన్ని సంధ్యాసమయాల్ని స్నేహితులిద్దరూ విస్కీలో కలుపుకుని తాగేరు. కాంతికి సుగుణంటే చాలా ఇష్టం. ఇద్దరికీ ఈతంటే ఇష్టం. స్విమ్మింగ్ క్లబ్బులో చేరి చేపల్లా పూల్ ఒదిలి వచ్చేవాళ్లు కాదు. సుగుణని పూల్‌లో చూస్తున్నంతసేపూ ఆమెకీ నీటికీ తప్ప, మట్టి ప్రపంచంతో సంబంధం లేదనిపించేది.

మూడో రౌండు అవగానే అన్నాడు రత్నం. "బస్. నే వస్తాన్రా. మిగతాదాని సంగతి నువ్వు చూసుకో."

శర్మకి నచ్చలేదు. "One for the road," అన్నాడు.

"ఒద్దురా బాబూ వెళ్తాను."

"ఓకే- అసలు మాట్లాడుకున్నట్టే లేదు. సరేలే ఎందుకో డల్‌గా ఉన్నావురా."

"అలిసిపోయాను. నీకోసం వచ్చేను. బై రా."

"ఉండు. విష్ణు దిగబెడతాడు."

"ఒద్దురా. ప్లీజ్ నా మాట విను. కేబ్‌లో వెళ్తా."

"వాడికి అలవాటే గదరా. వాడెప్పుడూ నీ డ్రైవరే గదా?"

"పోనీలేరా. నన్నొదిలెయ్యి, నువ్వు ముందు కూచో."

గుమ్మం వరకూ వచ్చి, మళ్లీ కిందికి గేటు వరకూ వచ్చి రత్నాన్ని కోప్పడి పైకి వెళ్లిపోయాడు శర్మ. మర్నాడు ఆఫీసుకి బయల్దేబోతూండగా విష్ణు ఫోన్ చేశాడు. "అంకుల్. చెప్పకుండా వెళ్లిపోయారు రాత్రి. నేను దించుతా గదా. ఆంటీ, సుగుణా నన్ను తిట్టుకుంటారు."

"డోంట్ వర్రీ, రాత్రి తిప్పడం నాకే నచ్చలేదయ్యా. ఏం పరవాలేదు. టైమైంది. నేను బయల్దేరతానన్నాను."

విష్ణు ఏదో అనే లోపలే దయారత్నం ఫోను పెట్టేశాడు. కారు తాళాలు తీసుకుని గుమ్మం దగ్గిర నుంచుని పిలిచేడతను.

"బేబులూ..."

రెండుసార్లు పిలిచినా పలకలేదామె. లోపలికి వెళ్లి చూసేసరికి సుగుణ నవ్వుతూ ఫోన్‌లో మాట్లాడుతోంది. ఆమె కళ్లనిండా నవ్వు.

"పద నిన్ను బస్టాప్‌లో దిగబెడతాను."

"పర్లేదు డాడీ. మీరెళ్లండి."

"రా తల్లీ. నాతోరా," అన్నాడతను.

ఫోను ఆపి అతని వెనక బయల్దేరిందామె.

బస్టాప్ వచ్చేవరకూ రత్నం రెండు శిలువలు మోస్తున్నట్టు కనిపించాడు.

"డాడీ, ఏంటి సీరియస్‌గా ఆలోచిస్తున్నారు?"

కొంచెం నవ్వుతూ అన్నాడు. "ఏంలేదు. నీ పెళ్లి ఎప్పుడు చేద్దామా అని ఆలోచిస్తున్నాను."

"డాడీ..."

మరో నిమిషం తరవాత సుగుణ దిగిపోయింది. కూతురంత నిట్టూర్పు విడుస్తూ ముందుకి వెళ్లిపోయాడు రత్నం. సాయంకాలం వరకూ కాన్ఫరెన్సు వదిలిన చాకిరేవులో అతనికి కుర్చీలోంచి లేవడానిక్కూడా సమయం దొరకలేదు. నాలుగున్నరకి టీ వచ్చింది. సిస్టం ఆపి వెనక్కి చేరబడి కళ్లు నులుముకుని కప్పు అందుకున్నాడు అతను. టీ రుచి చూసి పక్కన పెట్టుకుని ఫోన్ తీశాడు రత్నం. ఫోను మోగి ఆగిపోయింది. అతని కనుబొమలు వాటంతటవే చిక్కుపడ్డాయి. మళ్లీ టీ తీసుకుని ఫోన్ చేసే లోపల మెసేజి వచ్చింది.

"డాడ్, సెమినార్లో ఉన్నా, తరువాత చేస్తా."

మంగళవారం మధ్యాహ్నం వాళ్లకి సెమినారుంటుంది. మరో అరగంట తరవాత మళ్లీ ఫోన్ చెయ్యబోయి ఊరుకున్నాడు రత్నం. వెంటనే కొడుక్కి ఫోన్ చేశాడతను.

"డాడ్, ఏం చేస్తున్నారు?"

"ఆఫీసులో ఉన్నా, నువ్వు?"

"నేనిప్పుడే ఫుట్‌బాల్ ఆడి వచ్చా."

"క్రికెట్ ఒదిలేశావా?"

"లేదు ఉత్తిగనే, సరదాకి. మా ఫుల్ బేక్ వెనక పరుగెడతా ఉంటా."

రత్నం నవ్వేడు. కొడుకుని పేరు పెట్టి పిలవడు.

"బేటా సుగుణ మేడం పుట్టినరోజుకి వస్తున్నావా?"

"నో డాడ్. పోయిపోయి అది బుధవారం పుడితే నేనెట్లా వస్తా?"

"పోన్లే. ఈసారికి రా."

''సారీ నో వే. నేను దానికి చెప్పుకుంటాలెండి.''

''ఒస్తే బావుంటుంది.''

''చూద్దాంలెండి. మీకింకా పనుందా?''

''ఇంకో గంట. ఓకే. Try to come.''

''మమ్మీకి చెప్పండి.''

క్లాసులు వదిలి కొడుకు రాడని తెలుసతనికి. కొడుకు పేరు రత్నాకర్. ('నన్ను తిట్టకండి. మీకే తగుల్తాయి.')

అరగంటలో పని ముగించుకుని బయటపడి, ఒకసారి గార్డెన్ రెస్టారెంట్లోకి వెళ్లి, ఇంటికెళ్లి పోయాడు దయారత్నం. భోజనాల బల్ల దగ్గిర కూచుని తల్లీ కూతుళ్లు టీ తాగుతున్నారు. ఎదురుగుండా గిన్నెలో ఉల్లిపాయలు.

''డాడీ, ఏంటీ ఫోన్ చేశారు?''

''ఉత్తినే. అన్నయ్యకి కూడా చేశా. మంచినీళ్లివ్వు తల్లీ.''

అతని భుజం మీద చెయ్యివేసి మంచినీళ్ల గ్లాసు ముందు పెట్టింది సుగుణ.

''డాడీ అలిసిపోయారు మమ్మీ.''

''ముసలితనం, ఇంకా కుర్రాణ్ననుకుంటాడాయన.''

''మా డాడీ యంగే మమ్మీ.''

ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని నవ్వేడు రత్నం. సుగుణ వేపు చూస్తూ గ్లాసు ఖాళీ చేశాడు. సుగుణ కళ్లు ఎప్పుడూ శుభ్రంగా ఉంటాయి. ఎదుటి మనిషి మొహంలోకి సూటిగా చూస్తూ మాట్లాడుతుందామె. అది అతనికి ఇష్టం.

''మీ మమ్మీకి జెలసీ,'' అన్నాడతను.

సుగుణ తలవంచి నుదుటి మీద పెదాలు పెట్టగానే బెంగ ఆవరించిందతన్ని.

*

''అన్న అర్ధరాత్రి ఫోన్ చేశాడు మమ్మీ.''

పుట్టినరోజు కొత్తబట్టల్లో దీపంలా ఉంది సుగుణ. ఆఫీసుకి తయారై గ్రేస్ చెప్పుకుని, కుర్చీలోంచి పక్కకి వాలి కూతుర్ని దగ్గరికి తీసుకున్నాడు రత్నం.

''హాపీ బర్త్‌డే. అయిదు గంటలకి కేక్ వస్తుంది. నేనూ వచ్చేస్తాను.''

ముగ్గురూ టిఫిన్ చేశారు. దోశ నములుతూ ఆమె చూడకుండా కూతుర్ని చూస్తున్నాడు రత్నం. దోశ అంతగా రుచించలేదతనికి. సుగుణ సంతోషంగా ఉంది.

నాలుగురోజుల క్రితం సాయంత్రం కొంచెం ముందుగా వచ్చేడు దయారత్నం. రాగానే బట్టలు మార్చుకుని కూతురు పక్కన కూచున్నాడు. ఆమె సిద్ధంగా ఉంది.

"డాడీ, వాళ్లు బయల్దేరేరు."

"సరే, నాకూ రావాలని ఉంది."

సుగుణ ఇబ్బందిగా నవ్వింది. "పరవాలేదు డాడీ. విష్ణు ఉన్నాడు గదా. ముగ్గురం వెళ్లొస్తాం. మీరు హాయిగా రెస్టు తీసుకోండి."

"నీతో వద్దావని ముందుగా వచ్చేనే. ఒద్దంటే సరే."

"డాడీ, అదిగాదు. అలా షాపులు తిరుగుతుంటాం. మీకు సరదాగా ఉండదు. ఓకేనా?"

"ఓకే. పోనీ పాపం మమ్మీని తీసుకెళ్లొచ్చు గదా?"

శాంత నవ్వింది. "నా వల్లగాదు. నే తిరగలేను. మీరెళ్లండి తల్లీ. పిల్లలు సరదాగా తిరిగొస్తారు. మనం ఎందుకు మధ్యలో?"

"మీ ఇష్టం. ఓకే. నేను రావడంలేదు."

సుగుణ రత్నం చెయ్యి పట్టుకుని అంది. "డాడీ, కోపం వచ్చిందా?"

"ఏం లేదు. అయేం నువ్వు పట్టించుకోకు," అంది శాంత.

బయట కారు హారన్ మోగింది. "ఒచ్చినట్టుంది వాళ్లు," అంటూ సుగుణ హేండ్‌బేగ్ భుజానికి తగిలించుకుని రత్నం ముందు నుంచుని చెయ్యి చాపింది.

ఆమె చెయ్యి పట్టుకుని, "జాగర్త, త్వరగా వచ్చెయ్యి," అన్నాడతను.

"ఓకే డాడీ, బై."

ఆమెకి ఒకే అంగలో అక్కణ్నించీ, హాల్లోంచీ బయటికి వెళ్లాలని ఉంది అనుకున్నాడు రత్నం. ఆమె దరిదాపు అలాగే వెళ్లిపోయింది. ఆమె వెనక అతను కూడా బయటికి వచ్చేడు. కాంతి కారు బయట నుంచుని ఉంది. అంకుల్‌ని చూసి చెయ్యి ఊపుతూ వెనక తలుపు తీసి కూచుంది. సుగుణ విష్ణు పక్కన కూచుంది. కారు వెళ్లిపోయింది. విష్ణు చెయ్యి ఊపడం చూశాడతను. గేటు ఇవతల ఒంటరిగా నుంచుండిపోయాడతను. ఏదో ఒకటి చెప్పి తను కూడా వెళ్లి ఉండవలసింది. కానీ, అనుకోగానే తన మీద తనకే చిరాకేసింది. వెళ్లి చేసేదేంవుంది నిజానికి? వాళ్ల సంతోషంలో కాలు పెట్టడం తప్పు? గేటు ఇవతల పసుపు మందారచెట్టు తనమీద పడబోతున్న శిలువలా ఉంది. అప్పటికే బయట చీకటి పడుతోంది. వెనక్కి తిరిగి నీరసంగా లోపలికి వెళ్లేడతను.

"ఊ. వాళ్లతో వెళ్లిపోయేవనుకున్నాను."

వచ్చి దగ్గిర కూచుని ఆమె చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు రత్నం.

"ఏంటి నీరసంగా ఉన్నావు?" అందామె.

"ఏంలేదు."

“నీ కూతురు నాకు లిస్టు రాసిచ్చింది. బోయినాలకి వీళ్లు వస్తారు గదా. విష్ణుకి ఇష్టవని కొంచెం కొబ్బరన్నం చెయ్యమంది. అరవ సాంబారంట. అన్నీ బ్రేమ్మల వంటలే.”

“మొత్తానికన్నీ విష్ణుకి ఇష్టవైనవేనా? బేబులికో?”

“గెస్టులు గదా. ఉండు. స్నానం చేసొస్తా...”

అనుమతి కోసం ఎదురుచూడకుండా లోపలికి వెళ్లిపోయింది శాంత. శాంత ఎప్పుడూ అతని పక్కన కూచుని అతని చెయ్యి పట్టుకుని, అతని వేపు చూస్తూనో, నిశ్శబ్దంగానో మాట్లాడుతుంది. ఆమె ఏమీ మాట్లాడకపోయినా ఆమె అభిప్రాయం స్పష్టంగా తెలుస్తుంది రత్నానికి. అతను వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాడు. ‘శాంత పెద్ద చెట్టునీడ నాకు,’ అనుకున్నాడతను.

ముకుందాన్ని, ఆనందాన్ని గార్డెన్ రెస్టారెంటుకి బదులు ఏర్‌పోర్టుకి తీసికెళ్తే ఎలా ఉండేది? నెత్తిమీద బరువు పడ్డట్టయింది. చటుక్కున లేచి పడగ్గదిలోకి వెళ్లి బీరువాలో చొక్కాల పక్కనుంచి వస్తువు తీసుకుని చిన్నగుక్క మింగి కూచున్నాడు. స్థిమితపడుతూండగా శాంత ఒచ్చి, అద్దం ముందు నిల్చుని బట్టలు వేసుకుంటోంది. స్ప్రే వేసుకుని అతనివేపు తిరిగిందామె. రత్నం లేచి వెళ్లి ఆమెని దగ్గరికి తీసుకున్నాడు. సుఖంగా, నిర్భయంగా అనిపించిందతనికి.

భోజనానికి విష్ణు, కాంతీ వచ్చేరు. మనసులో ఒక జ్ఞాపకం మబ్బు వాలే వరకూ, కేకు కొయ్యడం దగ్గర్నించి భోజనాలు చేసి లేచేవరకూ, రత్నానికి ముగ్గురు పిల్లల్ని చూస్తుంటే కడుపు నిండుగా అనిపించింది. తండ్రిలాగే విష్ణు పొడుగు. అందం కాదుగానీ ఆకర్షణీయమైన ముఖం. (‘అంకులేదో ఆలోచిస్తున్నారు.’) భోజనాలవుతుండగా కొడుకు ఫోను చేశాడు. అతను చెల్లెలికి పంపించిన బహుమానం ఇంకా రాలేదు. వాళ్లని పంపించి నీరసంగా లోపలికి వచ్చింది సుగుణ.

“ఇలా నా దగ్గర కాసేపు కూచో బిడ్డా.”

రత్నం పక్కన కూచుని అతని భుజం మీద తలవాల్చిందామె. మళ్లీ బెంగ అనిపించిందతనికి.

“ఇంకెన్నాళ్లు, ఒచ్చే సంవత్సరం పెద్దదానివైపోతావు,” అన్నాడు రత్నం.

“డాడీ, ఇప్పుడేం చిన్నపిల్లనా?”

“కాదే, పీజీ స్టూడెంటంటే తేడా ఉంటది.”

“మీకు చిన్నపిల్లనే గదా?”

“వయసులో. కానీ నీ నిర్ణయాలు నువ్వు తీసుకుంటావు.”

“డాడీ, ఎప్పుడేనా సరే, మీరేం చెప్పినా వింటాను.” రత్నం గతుక్కుమన్నాడు.

ఆమె చెయ్యి పట్టుకుని, "ప్రామిస్?" అనేశాడు.

"నిజం డాడీ. ప్రామిస్."

ఆమె తలని మరింత దగ్గరికి తీసుకున్నాడు.

"ఇద్దరూ ఏం ప్రామిస్సులు చేసుకుంటున్నారు?"

*

దయారత్నం సాయంకాలాలు తిన్నగా ఇంటికి రావడంలేదు. గార్డెన్ రెస్టారెంట్లో కాసేపు ఆగి వెడుతున్నాడు. శర్మని కలిసి దరిదాపు రెండు నెలలైంది. నెలవారీ సమావేశం జరగలేదు. మధ్యలో ఒకసారి శర్మ ఫోన్ చేశాడు. శర్మని కలుసుకోవాలనే ఆతృత తగ్గిపోయింది. తనకి సుఖంగా లేదని తెలుస్తూనే ఉంది. ఉన్న ఒక్క శరీరంలో ఇద్దరు. ఇంటికి రాగానే కూతురు కోసం చూస్తాడతను. ఆమె రావడం ఆలస్యం అయితే నెల క్రితం బెంగగా ఉండేది. ఇప్పుడు అసహనం. రాత్రిళ్లు చాలాసార్లు రత్నం మేలుకొని ఉండడం చూసింది శాంత. ఆమె స్కూలు సంగతులు, అతను ఆఫీసు సంగతులు రాత్రి చెప్పుకోవడం అలవాటు. తను చెప్పేది మాత్రం వింటున్నాడతను. దరిదాపు రోజూ ప్రార్థన చేసుకోడం ఆమెకి ఆశ్చర్యం కలిగించింది. వాళ్లిద్దరి మధ్య రహస్యాలు లేవు. శర్మగారికి ఎక్కువగా ఫోను చెయ్యక పోవడానికీ అతని అశాంతికీ సంబంధం ఉందని అస్పష్టంగా తోచిందామెకి. ఎప్పుడూ లేనిది కూతురు రాకపోకలు అతనికి చిరుచేదుగా ఉంటున్నాయని తెలుస్తోంది శాంతకి. రత్నానికి బాధపడ్డం తప్ప బాధపెట్టడం తెలీదని మాత్రం ఆమెకి స్పష్టంగా తెలుసు. ఆ ఆలోచనలో ఉండగా నిద్రపట్టిందామెకి. రత్నం ఒక్కడే దేనికో బాధపడ్డం ఆమెకి బాధ కలిగించింది. రేపు అడగాలి అనుకుందామె.

తెల్లవారుజామున నాలుగు దాటింతరవాత శాంతకి మెలకువ వచ్చింది. రత్నం లేచి బాత్రూంకి వెళ్తున్నాడు. అతను బయటికి రావడం తెలిసిందామెకి. కొంచెం జరిగి పడుకుందామె. మళ్లీ పది నిమిషాలు నిద్రపట్టి లేవగానే రత్నం ఆమె చేతికి తగలలేదు. లేచి కూచుంది శాంత. ఆమెకి వెంటనే స్ఫురించింది. నిశ్శబ్దంగా కూతురి గదివేపు నడిచిందామె. రత్నం కూతురు కాళ్లవేపు కూచున్నాడు. ఒంగి మోచేతులు, మోకాళ్ల మీద ఆని కూచున్నాడతను. శాంత వెళ్లి డైనింగ్ రూం సోఫాలో కూచుంది. భయం ఏదో పెద్దపిల్లిలాగ ఆమె వీపుమీదికి దూకింది. కాసేపటికి రత్నం వచ్చి ఆమె దగ్గిర కూచోగానే అతని తడికళ్లని చూసిందామె. ఆమె భుజంమీద తల వాల్చుకోగానే శాంత భుజం తడిసిపోయింది. ఆమె గుండె వేగం పెరిగింది. తేరుకుని, చాలాసేపు మాట్లాడేడు రత్నం. ఆమె ఒంటిమీదికి వేడి తారు జారుతున్నట్టని పించింది.

"నువ్వు నాకెందుకు చెప్పలేదు?"

"చెప్పాలనే అనుకుంటున్నాను."

"రత్నం, నువ్వు సరిగ్గా చూశావా?"

"కూతుర్ని గుర్తుపట్టలేనా? పొడుగు టీ షర్టు నేనే కొనిచ్చేను."

"నువ్వు బేబుల్తోగాని మాట్లాడేవా?"

తల అడ్డంగా ఊపేడతను.

"అడగాల్సిందేమో."

"అది అబద్ధం చెప్పదు. నా భయం అదీ."

కాసేపు ఇద్దరికీ మాట్లాడాలనిపించలేదు. నిశ్చింతగా గాఢనిద్రలో ఉన్న సుగుణ ముఖం కనిపించిందతనికి.

"ఆ అబ్బాయి చాలా మంచోడు రత్నం."

"సమస్య అదిగాదు. శర్మ ఇంటికి నేను నిప్పు పెట్టడమే. వాళ్లందరి ముందూ వాడి పరువుపోద్ది. అది వాడు భరించలేడు. శిలవేసినట్టే వాడికి."

"మాట వరసకి. అడిగితే అన్నయ్యగారు ఒప్పుకోడంటారా?"

"ఒప్పుకుంటాడు. సగం చచ్చి బతుకుతాడు ఇంక. మన మీద ఇష్టంలేక కాదు. వాడికి వాడు ఒక్కడేగాదు నీకు తెలీదు."

"కాంతికి తెలుసా?"

"తెలిసే ఉంటది."

"పోనీ నేను బేబుల్తో మాట్లాడనా? నాకేందో దడగా ఉంది రత్నం."

"అప్పుడే వద్దు. ఇదంతా ఈమధ్యనే అయుంటుంది. I am sure."

"ఎవరికీ చెప్పకుండా ఏవేనే చేస్తే?"

"అది అలా చెయ్యదు శాంతా."

"నువ్వు బాధపడకు. ఆలోచిద్దాం. దాంతో మాటాడకుండా చేసేదేవుంది?"

"నేను ఆలోచించి చెప్తా. శాంతా, I am not a good man."

"అట్లా అనుకోమాక."

డైనింగ్ హాలు గాజు కిటికీలు తెల్లబడ్డాయి. "లే నేను కాఫీ చేస్తాను."

అతను లేచి వాళ్ల గదిలోకి వెళ్లేడు.

శాంత కాఫీ చెయ్యడానికి వంటింట్లోకి వెళ్లింది. బయటినుంచి లోపలికి మెల్లిగా వెలుగు పాకుతోంది. ఇవాల్టి నుంచీ వేరుగా ఉంటుంది అనుకుంది శాంత. కూతురి మీద కోపం రాలేదామెకి. నడుచుకుంటూ వెళ్లి గుంటలోకి జారినట్టయింది. మరో అరగంటలో సుగుణ లేస్తుంది.

“మార్నింగ్ మమ్మీ,” అంటుంది.

“బ్రష్ చేసుకో. కాఫీ అయింది,” అంటుంది తను.

ఆమె ముఖం తడుచుకుంటూ వచ్చి శుభ్రంగా చూస్తుంది. ఇవాళ రోజూలా ఉండదు. రత్నం రాగానే ఇద్దరూ కూచుని నిశ్శబ్దంగా కాఫీ తాగేరు. వేడి బెంగ. సుగుణ రోజూకంటే ముందే లేచింది.

మెడచుట్టూ తువాలు వేసుకుని “గుడ్ మార్నింగ్స్,” అంటూ నవ్విందామె.

భార్యాభర్తలిద్దరూ గతుక్కుమన్నారు.

“ఏంటీ, ఇద్దరూ నన్ను గుర్తుపట్టలేదా?”

*

మళ్లీ బయటికి చూశాడు దయారత్నం. బయటి ప్రపంచం సిరాతో గీసిన బొమ్మలా ఉంది. చీకటి సొరంగంలోంచి వేగంగా దొలుచుకుంటూ పోతోంది రైలు. సెల్లు తీసి మళ్లీ మెసేజి చూశాడు. నిన్న సాయంకాలం చేశాడు విష్ణు. ('Dad critical. Wants to see you.') రత్నం కళ్లనిండా నీళ్లు తిరిగేయి.

విష్ణు పెళ్లికి వెళ్లినప్పుడు కలవడమే. అప్పటికే అతన్ని చూసి కొన్ని ఏళ్లయింది.

“ఒక్కడివే ఎందుకొచ్చేవురా?” అని కోప్పడ్డాడు.

ఉన్న రెండు రోజులూ తల్లడిల్లిపోయేడు రత్నం. అతని మీద అతని అసహనం నిలవనియ్యకుండా చేసింది. రాకుండా ఉండవలసింది. తను మంచి తండ్రి కాదేమో. ఏం హక్కుంది తనకి? కళ్లజోడు తీసి కళ్లు తుడుచుకున్నాడు. తనని మామూలుగానే పలకరించాడు విష్ణు. సుగుణ గురించి అడగలేదు.

ఆరు సంవత్సరాల క్రితం ఒక సాయంత్రం ఒక పెద్దగుక్క విస్కీ మింగి కుదుటపడి చెప్పేడు రత్నం. శర్మ వెంటనే తేరుకోలేకపోయాడు.

“తప్పదురా, ఆ నిర్ణయం పైనుంచి ప్రత్యేకంగా వచ్చింది. నాగపూరు ట్రాన్స్‌ఫరు చేశారు. మళ్లీ వచ్చేస్తాననుకో!”

“నీకెప్పుడు తెలిసింది?”

“అఫీషియల్‌గా మూడు నాలుగురోజులైంది. మొదట కొంచెం అడిగి చూశాను.”

శర్మ ఏవీ మాట్లాడలేదు. రత్నానికి అతన్ని చూస్తున్నంతసేపూ బొడ్డు దగ్గర ఏదో తొలుస్తున్నట్టుంది. మిగతా రెండు గంటలు ట్రాన్స్‌ఫరు గురించే మాట్లాడేడు ('Bastards') శర్మ. తరువాత కాబ్‌లో ఇంటికి వెళ్తూ అనుకున్నాడతను. ఈ కారు ఇలాగే ఎక్కడికేనా తీసికెళ్లిపోతే బాగుండును. అతనికి ఇంటికి వెళ్లాలని లేదు. సుగుణ ముఖం చూడ్డం కష్టంగా ఉంది రత్నానికి. దాన్ని దగ్గరికి తీసుకుని చెవిలో దానికి వినబడకుండా క్షమాపణలు చెప్పుకోవాలనుంది.

కొద్దిరోజుల క్రితం రాత్రి పడుకోబోయే ముందు శాంత చెయ్యి తీసుకుని అన్నాడు. "శాంతా నేను నాగపూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను."

ఆమెకి నోటమాట రాలేదు.

"బేబులు మంచి కోరి చేస్తున్నాను. వాడి మంచి కోరి కూడా చేస్తున్నాను."

శాంత ఏవీ మాట్లాడలేదు. సుగుణ సమస్య సుఖంగా తేలిపోతుందని ఆమె అనుకోలేదు. వీపు మీద కురుపులా ఉంది.

"నాకు వేరే దారి కనిపించలేదు. ముందు దూరంగా వెళ్లిపోయి తరవాత మాట్లాడదాం. ఇక్కడ ఇక ఉండలేను శాంతా. ప్రతిరోజూ దాన్ని అనుమానంగా చూడ్డం సిగ్గుగా బాధగా ఉంది."

మర్నాడు సాయంకాలం ఆఫీసు నుంచి సుగుణకి ఫోన్ చేశాడు. ముందు కొడుకుతో చాలాసేపు మాట్లాడేడు రత్నం.

"బేబులూ, మనం నాగపూరు వెళ్తున్నాం."

"దేనికి డాడీ?"

"... నాకు ట్రాన్స్‌ఫరయింది."

ఒక అయిదారు నిమిషాలు ఆమెని మాట్లాడనియ్యకుండా తనే మాట్లాడేడు రత్నం. మామూలుగా కంటే గంట ఆలస్యంగా ఇంటికెళ్లేడు రత్నం. ఒక క్షణం గార్డెన్ రెస్టారెంటు వేపు తిప్పబోయి తిన్నగా ఇంటికి వెళ్లేడు అతను. భోజనాల బల్ల దగ్గర తల్లీకూతుళ్లు రోగికి చెరో పక్కనా కూచున్నట్టున్నారు.

సుగుణ ముఖం చూడగానే రత్నానికి గుండెల్లో మేకు దిగినట్టయింది. హడావుడిగా లోపలికి వెళ్లి చాలాసేపు స్నానం చేసి బట్టలు మార్చుకుని రాగలిగే డతను.

"ఏంటి డాడీ!"

రెండు జీవితాలకి సరిపడే అబద్ధాలు  ఒకదాని మీద ఒకటి పేర్చుకుంటూ వెళ్లేడు రత్నం. సుగుణ ముఖం చూడక తప్పడంలేదతనికి. కాసేపాగి ఆమె లోపలికి వెళ్లిపోయింది. భార్యాభర్తలిద్దరూ జ్వరపడి అలాగే కూచుండిపోయారు. తరువాతి ఆదివారం రత్నాకర్ వచ్చి వెళ్లేడు. హైదరాబాదు జీవితానికి సరిపడా అట్టపెట్టెలు, చెక్కపెట్టెలు తెప్పించాడు రత్నం. వారంలోనే రత్నం జ్వరం వచ్చి తగ్గినట్టున్నాడు. సుగుణ మామూలుగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఆరోజు మధ్యాహ్నం కాలేజీ నుంచి వచ్చేసిందామె. శాంత స్కూలుకి వెళ్లడం మానేసింది. సుగుణ వచ్చి ఇద్దరికీ టీ చేసి తల్లి పక్కన కూచుంది.

“మమ్మీ, డాడీ ఏంటి ఏదోగా ఉంటున్నారు? నువ్వూ అంతే. ఏదేనా ప్రాబ్లం ఉందా? నాకు చెప్పకూడదా? ట్రాన్సఫరు కాదు. అంతకుముందు నుంచే చూస్తున్నా ఏమైంది? నువ్వు చెప్తావా, డాడీనే అడగమంటావా? డాడీ...”

సన్నటి కన్నీటి పొరలోంచి గుండుసూదిలా చూసింది తల్లివేపు.

వెంటనే మాట్లాడలేదామె. అసంకల్పితంగా అంది శాంత. “డాడీ నీ గురించి బెంగ పెట్టుకున్నారు. బాధపడతన్నాడు.”

సుగుణ టీ తాగుతూ ఏమీ అనలేదు. బెంగ! బెంగ ఎందుకు? పది నిముషాలు టీ తాగి లోపలికి వెళ్లిపోయింది సుగుణ. మొహం చన్నీళ్లతో కడుక్కుని అద్దంలోకి చూస్తూండిపోయింది. బెంగ? ఆమెవేపే చూస్తున్న కళ్లు తటాల్న విచ్చుకున్నాయి. గుండె వేగం పుంజుకుంది. అలాగే నిలబడి పోయిందామె. (‘డాడీ.’) హఠాత్తుగా జ్వరం తగిలి ఒళ్లు వేడెక్కి చల్లబడినట్టయింది. ఆమె మెల్లిగా మంచం దగ్గరికి వెళ్లి నుంచోలేక కూచుండిపోయింది. డాడీ. (‘అప్పుడే?’) సుగుణ కళ్లు నీళ్లు చిమ్మేయి. మంచం మీద వాలిపోయిందామె. కళ్లనిండా ఆశ్చర్యం అలాగే ఉండిపోయింది.

మర్నాడు బయల్దేరతారనగా అందర్నీ భోజనానికి పిలిచేడు శర్మ. సుగుణ ఎక్కువ కాంతితోనే ఉంది.

“ఒరే దయా, నువ్వులేని హైదరాబాదులో ఎలా ఉండాలో తెలీడం లేదు.”

“ఎక్కువకాలం ఉండన్రా అక్కడ.”

శర్మ కుటుంబం అంతా బెంగపడింది. రత్నానికి తెలుస్తూనే ఉంది. కానీ ఇంటికి వెళ్లిపోవాలనిపించింది.

భోజనాల గదిలో సోఫాలో కూలబడ్డాడు రత్నం. కళ్లు మూసుకున్నాడతను. ఇల్లంతా ఖాళీగా ఉంది. ఖాళీ కోడిగుడ్డులా.

“ఏంటీ డాడీ ఆలోచిస్తున్నారు?” పక్కన వచ్చి కూచుంది సుగుణ.

“ఏంలేదమ్మా,” ఆమె అతని భుజం మీద తల పెట్టుకుని అతని చెయ్యి పట్టుకుని అంది.

“డాడీ, మీరు నా గురించి బెంగపడకండి. బాధపడకండి.”

ఉలిక్కిపడ్డాడతను. కళ్లు తెరవడం లేదు రత్నం. ఆమే చిన్నమాట అనడం మంచిదనుకుంది.

“నాకేం కొత్తగా ఉండదు డాడీ. ప్రామిస్. మీరు నా గురించి ఆలోచించ కండి. హైదరాబాద్‌కి గుడ్ బై.”

రత్నానికి కళ్లు తెరవాలనిపించలేదు. ఆమె చెయ్యి వదలాలనిపించలేదు. ఆమే మృదువుగా చెయ్యి తీసుకుని తన గదిలోకి వెళ్లిపోయింది.

రాత్రి రైలు బయలుదేరిన చాలాసేపటి వరకూ ముగ్గురూ బయటికి చూస్తూ కూచున్నారు. రైలు పారిపోతున్నట్టనిపించింది, సుగుణకి. రాత్రి ఎక్కడికో తీసుకు పోతోంది అనుకున్నాడు దయారత్నం. అంతా లయబద్ధమైన స్తబ్ధతలో ఉండిపోయి నట్టనిపించింది శాంతకి. తొమ్మిదయింతరవాత మొదటిసారిగా మాట్లాడిందామె.

"బేబమ్మా, రోటీల బాక్సు తీస్తావా?"

స్టేషనుకి శర్మ కుటుంబం అంతా వచ్చింది. విష్ణు తప్ప అందరూ మాట్లాడు తున్నారు. కాంతి సుగుణని వదల్లేకపోయింది.

*

మొదట కొంతకాలం, నాగపూరు కొత్తనిపించినా త్వరగానే అలవాటయి పోయింది. చాలాకాలంపాటు ముగ్గురూ కాసేపు హైదరాబాదులో, కాసేపు నాగపూరులో ఉండేవారు. ఒక గదిలోంచి మరో గదిలోకి వచ్చినట్టు.

మళ్లీ ఓసారి కిటికీలోంచి బయటికి చూశాడు దయారత్నం. ఎప్పటిలాగే కదిలిపోతున్న చీకటి. అక్కడక్కడ వెలుతురు చిల్లులు. దిళ్లు సర్దుకుని నడుం వాల్చేడతను.

'ఇది నా కూతురు,' అనుకునేవాడతను చాలాసార్లు.

కొన్ని నెలలపాటు దయారత్నం మూడోకన్ను సుగుణ వీపుకి అతుక్కు పోయింది. ఆమె ముఖంలో, మాటలో, చూపులో మార్పు కనిపించలేదతనికి. ఆమె తన గదిలోకి వెళ్లిన తరువాత ఎలా ఉంటుందో తెలుసతనికి. బేబుల్ని దగ్గరికి తీసుకుని ఓదార్చాలనీ, మాట్లాడాలనీ అనిపిస్తూండేదతనికి. తరచుగా ఇద్దరూ షాపింగ్‌కి వెళ్తారు. కూతురు తనతో వివరంగా మాట్లాడుతుందని శాంత నమ్మకం. శర్మ వారానికోసారి ఫోన్ చేసినప్పుడల్లా అతను సెల్లు వేపు చూస్తాడు. దీనికి దగ్గిర దూరాల్లేవు. ఏవో ఆలోచనలు.

రాత్రి పడుకోబోయే ముందు శాంత మాట్లాడుతూంటుంది. అంతా విని అంటాడతను.

"అది నా కూతురు. ఏవీ అవదు శాంతా. తను ఏదేనా అనుకుంటే చెయ్యగల్దు. కూడదనుకుంటే మానెయ్యగలదు. మధ్యలో అది పడే శోదన ఎవరికీ తెలీదు."

పడుకోబోయే ముందు ఇంగ్లీషు బైబిలు చదువుకుంటూనే ఉన్నాడు రత్నం. ('ఏం లాభం పాపం.')

హైదరాబాదులో కంటే పని ఎక్కువగానే ఉంది. కానీ అదే బాగుందని పించింది రత్నానికి. పీజీ మొదటి సంవత్సరం అయిపోయింది సుగుణకి. దయా రత్నం బాగానే తేరుకున్నాడు. కానీ తను ఎప్పటికీ పోగొట్టుకోవడం ఇష్టపడనిదేదో చెయ్యిజారి పోయిందని రత్నానికి తరచుగా అనిపిస్తూంటుంది. ముగ్గురూ కలిసి భోజనాల బల్ల దగ్గర కూచున్నప్పుడు ఎప్పుడేనా సుగుణ ఫోను మోగితే చటుక్కున సెల్లు వేపు చూసేవాడు రత్నం. ఎప్పుడో తప్ప లేచి వెళ్లి మాట్లాడేది కాదు సుగుణ. తను ఎప్పుడూ మర్చిపోలేని సుగుణ అన్నమాట ఒకటి రత్నానికి బాధాకరమైన సంతోషం కలిగిస్తుంది. ఒకసారి ముగ్గురూ టిఫిన్ చేసిన తరవాత సుగుణ సెల్లు మోగింది. అప్పటికే లేచిందామె.

“మమ్మీ, తరవాత చేస్తానని చెప్పు,” అని రత్నం వేపు ఓసారి చూసి వెళ్లిపోయిందామె.

“చెప్పు,” అంది శాంత.

కాసేపు మోగనిచ్చి సెల్లు తీసుకుని ఆపేశాడు రత్నం.

“అదేం?” అంది శాంత.

అతను అలాగే కూచుండిపోయాడు. నోటమాట రాలేదు. బాధనిపించింది రత్నానికి. అరగంట తరవాత వచ్చింది సుగుణ.

“మమ్మీ చెప్పేవా?”

“డాడీ ఆపేశాడు తల్లీ.”

సుగుణ రత్నం వేపు చూసింది. విప్పారిన ఆమె కళ్లు అతని ముఖాన్ని శుభ్రం చేస్తున్నాయి. చివరికి కూతుర్ని చూస్తూ అన్నాడతను.

“ఎందుకమ్మా, పెర్సనల్ ఫోను గదా?”

ఎవరు చెప్పదల్చుకున్నది వాళ్లు చెప్పుకున్నారని ఇద్దరికీ అర్థమైంది. మనసులో అనుకున్నాడు రత్నం- ‘అది నా కూతురు.’

అప్పటికింకా సుగుణ పీజీ మొదటి సంవత్సరంలో ఉంది. మరొక్కసారి మాత్రం ఫోను చాలాసేపు టేబిలు మీద ఒదిలి గదిలోకి వెళ్లిపోయింది సుగుణ. రత్నం పేపరు చదువుకుంటూ కూచున్నాడు. రోజంతా శాంత ఒంటరిగా ఉంటుంది. ఇద్దరిలో ఎవరు ముందొస్తే వాళ్ల చెయ్యి పట్టుకుని కూచుంటుంది కాసేపు, గట్టెక్కినట్టు.

మరుసటి ఏడాది రత్నాకర్‌కి బెంగుళూరులో ఉద్యోగం వచ్చింది. బెంగుళూరులో చేరేముందు ఇంటికొచ్చేడతను. ఇల్లంతా సంతోషం బుడగలా

తేలుతూ ఉండిపోయింది. ఆదివారం నలుగురూ భోజనాలు చేసి కూచున్నారు. హఠాత్తుగా శర్మ ఫోన్ చేశాడు. అందరూ తలోసారీ మాట్లాడేరు.

చివరిగా సుగుణ మాట్లాడుతూ, ''ఒద్దంకుల్. నాకు ఇక్కడే అవకాశం ఉంది. గేరంటీ. మీకు అన్నీ తరవాత చెప్తాను. Thanks uncle,'' అంది.

రత్నం ప్రశ్నార్థకంగా చూశాడు.

''హైద్రాబాదులో నాకు ఉద్యోగం చూస్తానంటున్నారు అంకుల్.''

''ఇంకేం వెళ్లవే బాబూ,'' అన్నాడు రత్నాకర్.

''నాకు ఇంటరెస్టు లేదన్నా. నువ్వు బెంగుళూరులో చూడు, వచ్చేస్తా.''

''పోనీలేరా, దానికిష్టంలేదు,'' అంది శాంత.

తండ్రి వేపు చూస్తూ అంది సుగుణ. ''ఔను డాడీ. నాకేవీ ఇష్టంలేదు.''

శర్మతో చెప్పిన అబద్ధం చాలా నెలల తరవాత నిజం అయింది. సుగుణకి అనుకోకుండా నాగపూరులో ఉద్యోగం దొరికింది.

''డాడీ, మీకు ఓకేనా?''

టీ కప్పు చిన్న బల్లమీద పెట్టి కూతుర్ని దగ్గరికి తీసుకున్నాడు రత్నం. కళ్లు చెమర్చేయతనికి. ఆమె తల నిమురుతూ ఉండిపోయాడతను. రత్నం చాలాసేపు మాట్లాడినట్టనిపించిందామెకి. నాగపూరులోనే ఆమెకి ఉద్యోగం రావడం ఆశ్చర్యం కలిగించింది రత్నానికి. కానీ రెండేళ్ల తరవాత కూతురి విషయంలో మరోసారి ఆశ్చర్య పడవలసి వచ్చింది.

రిటైరయి బెంగుళూరు చేరుకున్నాడు రత్నం. కొద్దిరోజుల్లో బెంగుళూరు వెళతారనగా ఓ మధ్యాహ్నం కాలింగ్ బెల్ మోగింది. లేచి తలుపు తీసి ఒచ్చి, ''నీకోసమే,'' అంది శాంత.

ముందుగదిలో కొంచెం తెల్లగా పొడుగ్గా నుంచుని ఉన్నాడతను.

''సార్, నమస్తే, I am Srinivas Gopal.''

విశాఖపట్నంలో స్థిరపడ్డ కన్నడిగులు వాళ్లు. సుగుణ పనిచేసే కంపెనీలో సీనియర్ పొజిషనతనిది. నలభై అయిదు నిమిషాల తరవాత లోపలికొచ్చి గ్లాసెడు మంచినీళ్లు తాగి శాంత వేపు చూస్తూండిపోయాడు దయారత్నం.

''ఎవరా అబ్బాయి?''

మామూలు కంటే ఆలస్యంగా వచ్చింది సుగుణ. రాగానే తండ్రి వేపోసారి చూసి లోపలికి వెళ్లిపోయింది.

కాసేపాగి రత్నం ఆమె గదిలోకి వెళ్లేడు. మంచంమీద కూచుని అద్దం ముందు జుట్టు సరిచేసుకుంటున్న కూతుర్ని పిలిచేడు. కూచోబోతూ తండ్రివేపు చూసిందామె. నాలుగైదేళ్ల తరవాత కూతురి కళ్లనిండా నవ్వు చూశాడతను.

"మీ గోపాల్ వచ్చేడు."

"చెప్పేడు. నేనే పంపించేను డాడీ."

"అవును. నిజంగా నీకిష్టమేనా?"

ఆమె తల ఊపింది.

రత్నం ఏవీ మాట్లాడలేదు.

"మీకు ఇష్టం లేదంటే చెప్పండి డాడీ."

"మా ఇద్దరికీ ఇష్టవే తల్లీ," ఆమె ముఖం తనవేపు తిప్పుకుని అన్నాడతను. "బేబులూ, నా మీద ఒట్టేసి చెప్పు."

అతని నెరిసిన జుట్టు మీద చెయ్యి పెట్టి, "నిజం డాడీ," అందామె.

ఆమె కళ్లలోకి చూశాడతను. మామూలుగా మెరుస్తున్నాయి. కూతుర్ని దగ్గరికి తీసుకుని అన్నాడు దయారత్నం.

"అంతా దేవుడి దయ. Come let us pray."

నిజానికి ఉద్యోగంలో చేరగానే కదిలించింది శాంత.

"రత్నంగారూ, బేబీకి పెళ్లి చెయ్యావా? నేను అడగనా?"

కాసేపు ఆలోచించి అన్నాడతను. "నువ్వోసారి మాట్లాడి చూడు. బలవంతం చెయ్యకు."

మర్నాడు రాత్రే అడిగింది శాంత.

"ఇప్పుడేగదా మమ్మీ చేరేను. కొన్నాళ్లు ఆగమని చెప్పు డాడీని."

ఉదయం టిఫిన్ ప్లేట్లు ముందు పెట్టుకుని కూచున్నారు ముగ్గురూ. ఇడ్లీ ముక్క పచ్చడిలో ముంచి కూతురు నోట్లో పెట్టేడు దయారత్నం.

*

దయారత్నం ఆస్పత్రికి వెళ్లేసరికి పదిన్నర అయింది. ICU ముందు గదిలో విష్ణు భుజం మీద తల పెట్టుకుని కూచుంది కాంతి. రత్నాన్ని చూడగానే వచ్చి అతన్ని పట్టుకుని కళ్లనీళ్లు పెట్టుకుందామె. ఆమెని దగ్గరికి తీసుకుని విష్ణు వేపు చూశాడతను.

"మధ్యలో అప్పుడప్పుడు స్పృహలో ఉంటున్నారంకుల్. బహుశా మిమ్మల్ని చూసి..."

రత్నం గొంతు కన్నీళ్లతో నిండిపోయింది.

"డాక్టరేమన్నాడు?"

క్షణంసేపు ఆగి అన్నాడు విష్ణు. "ఎప్పుడేనా అవొచ్చు."

"నేను వాణ్ని చూసొస్తాను."

రత్నం లోపలికి వెళ్లి శర్మ మంచం పక్కన కూచున్నాడు. గడ్డం తెల్లగా పెరిగి నీరసించడం తప్ప శర్మ మామూలుగానే ఉన్నాడు. మెల్లిగా శర్మ చేతిమీద చెయ్యి వెయ్యగానే, ఆరేడు సంవత్సరాల దుఃఖం వెళ్లుకొచ్చింది. అతని చెయ్యా, ఏదో దుఃఖస్పర్శా, శర్మని కదిలించి కళ్లు తెరిపించేయి. రత్నాన్ని చూడగానే శర్మ వేళ్లు అతని చేతిని బలహీనంగా పట్టుకున్నాయి. రత్నం ముఖంలోకి చూడ్డం అతనివల్ల కావడం లేదు. కళ్లనీళ్లు ఆగడం లేదతనికి. నోరు తెరిచి ఏదో చెప్పాలని ప్రయత్నం చేస్తున్నాడతను. మాట రావడంలేదు శర్మకి. అతని చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు రత్నం. రత్నంవేపు చూస్తూ మళ్లీ నిద్రలోకి జారిపోయేడు శర్మ. మరో నిముషం కూచుని కళ్లు తుడుచుకుని బయటికి వచ్చేడు దయారత్నం.

హోటలుకొచ్చి కాసేపు పడుకోవాలని ఎంత ప్రయత్నించినా నిద్రపట్ట లేదతనికి. సుగుణకీ, శాంతకీ ఫోన్ చేశాడతను. అతని మనసులో ఒకే ప్రశ్న. ఎవరినీ అడగలేడతను. ఇంక సమాధానం దొరికే అవకాశం లేదు.

సాయంకాలం ఆస్పత్రికి వెళ్లేడు దయారత్నం. శర్మ కుటుంబం అంతా కన్నీటితో తడిసిపోతూ కనిపించింది. అతికష్టం మీద శర్మ భార్యని పలకరించి లోపలికి వెళ్లేడతను. నిద్రా మెళుకువ కాని స్థితిలో ఉన్నాడు శర్మ. రత్నం బయటికి వచ్చి వరండా చివర కిటికీలోంచి బయటికి చూస్తూ నుంచున్నాడు.

"అంకుల్..."

తన పక్కకి వచ్చి నుంచుంది కాంతి. కాసేపు ఏమీ మాట్లాడలేదామె.

"మీతో ఒక మాట చెప్పాలంకుల్. నాన్న చెప్పమన్నారు."

మళ్లీ తటపటాయించి అంది కాంతి.

"నేనో పొరపాటు చేశానంకుల్. రెండ్రోజుల్లో హాస్పిటల్లో చేరతారనగా నోరు జారి అన్నానంకుల్. విష్ణు భార్య గురించి మాట్లాడుతుంటే అనుకోకుండా... సుగుణ, విష్ణు గురించి అనేశానంకుల్. క్షమించండి. నాన్నగారికి నోటమాట రాలేదంకుల్. నావేపు చూస్తూండిపోయారు. నాకు భయం వేసింది... రాత్రి నా దగ్గరికొచ్చి కూచున్నారు. నా చెయ్యి పట్టుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నారు. వాడెంత మంచివాడమ్మా. ఎంత గొప్పమనసమ్మా వాడిది. నా తరపున వాడికి థాంక్స్ చెప్పు. నేను చెప్తాలే అని వెళ్లిపోయారంకుల్."

ఆమె తలమీద చెయ్యి వేసి, ''పరవాలేదు తల్లీ,'' అన్నాడు రత్నం.

అతని రక్తమాంసాలు గాలిలో కలిసిపోయాయి. పెద్ద కొండచరియలాంటి దుఃఖం అతన్ని కబళించింది. కాంతిని వదిలి కిటికీ దగ్గర నిలబడ్డాడతను. అతని కళ్లను చింపుకుంటూ కన్నీళ్లు. 'వాడికి థాంక్స్ చెప్పాలమ్మా.' చెవిలో వేడి తారు చుక్కలు. ఇప్పుడు శర్మని ఎలా చూడ్డం? కళ్లు తుడుచుకుని శర్మ దగ్గరికి నడిచాడు దయారత్నం.

సగం తీసిన గాజు తలుపులోంచి కాంతి గొంతు వినిపించింది.


''నాన్నా... నాన్నా...''

రత్నం లోపలికి వెళ్లలేదు.

వరండాలో కూచుని ఈసారి స్నేహితుడి కోసం వెక్కి వెక్కి ఏడిచాడు దయారత్నం.

*'గుప్తా 91' కథాసంపుటి*
*అక్టోబర్ 2022*

✱



**తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి** 14 మే 1945న తూర్పు గోదావరి జిల్లాలో జన్మిం చారు. వీరి మొదటి కథ సీతన్న **తాట** 1962లో ఆంధ్రప్రభలో అచ్చయింది. ఏడు కథాసంపుటాలు- *వడ్లచిలకలు, పతంజలిశాస్త్రి కథలు, నలుపెరుపు, రామేశ్వరం కాకులు, సమాంతరాలు, జెన్, గుప్తా 91*, నాలుగు నవలలు, నాలుగు నాటకాలు, భమిడిపాటి కామేశ్వరరావుగారి సంక్షిప్త జీవితచరిత్ర, ఒక కవితాసంపుటి ప్రచురించారు. ఆర్కియాలజీ చదివి, పర్యావరణ కార్యకర్తగా స్థిరపడి ప్రస్తుతం ఎన్విరాన్‌మెంట్ సెంటర్ అధ్యక్షులుగా ఉన్నారు.

***చిరునామా: 86-4-16/1, వాడ్రేవునగర్, రాజమండ్రి - 533003, తూ.గో. జిల్లా***
***ఫోన్: 94407 03440    Email: ec_india@yahoo.com***